# నేడు 144 సెక్షన్

కారేపల్లి, డిసెంబర్ 2: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండలంలో మండలంలో ఆదివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, డీజేలు ఉపయోగించడం నిషిద్ధమని చెప్పారు. నలుగురికంటే ఎక్కువ మంది గుంపుగా ఉండకూడదన్నారు. సోషల్ మీడియాలో రాజకీయపరమైన పోస్టులు పెట్టవద్దన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**మణుగూరులో..**

మణుగూరు టౌన్, డిసెంబర్ 2: ఎన్నికల ఫలితాలు వెలువడే ఆదివారం రోజున నియోజ్వర్గవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని మణుగూరు డీఎస్పీ రాఘువేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.00 నుంచి సోమవారం ఉదయం 6.00 గంటల వరకు 144 సెక్షన్ అంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురికి మించి గుమికూడవద్దని, వీధుల్లో బాణసంచా కాల్చవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని, బైక్‌లతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. దీనిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, పార్టీల నాయకులు సంయమనం పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**నేడు మద్యం దుకాణాలు బంద్**

మణుగూరు టౌన్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న ఆదివారం రోజున నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

## ముమ్మరంగా వరి కోతలు



వరికోత మిషన్ల ద్వారా వరికోతలు కోస్తున్న రైతులు

పెనుబల్లి, డిసెంబర్ 2: వాతావరణ మార్పులతో రైతన్నలు ఆందోళనతో హడావిడిగా వరి కోయిస్తున్నారు. మండలవ్యాప్తంగా ఇప్పటికే కొందరు రైతులు కళ్లాలపై ధాన్యం ఆరబోశారు.

తల్లాడ, డిసెంబర్ 2: వాతావరణ మార్పుతో రైతుల్లో ఆందోళన మొదలైంది. 4వ తేదీ లోపు తుఫాన్ ప్రభావం ఉంటుదన్న వార్తలతో అప్రమత్తమయ్యారు. హడావుడిగా వరి కోయిస్తున్నారు.

## మద్యం దుకాణ నిర్వహణపై ఫిర్యాదు

దమ్మపేట, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మద్యం దుకాణంపై ఆ ప్రాంతానికి చెందిన మహిళలు ఎక్సైజ్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం నివాసాల మధ్యలో ఉన్నదని, మందుబాబులు మద్యం తాగి నిత్యం గొడవలు పెట్టుకుంటున్నారని, చుట్టుపక్కన నివసిస్తున్న వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని అశ్వారావుపేట ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దుకాణం తొలగించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## స్వల్పంగా పెరిగిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేట, డిసెంబర్ 2: పామాయిల్ గెలల ధర స్వల్పంగా పెరిగింది. అక్టోబర్‌తో పోలిస్తే నవంబర్ నెలకు టన్ను ధర రూ.258 పెరిగింది. అక్టోబర్‌లో టన్ను గెలల ధర రూ.12,196 ఉండగా నవంబర్‌లో రూ.12,454కు చేరింది. పెరిగిన ధర నవంబర్ నెలలో ఫ్యాక్టరీకి గెలలు తరలించిన రైతులకు మాత్రమే వర్తిస్తుందని ఆయిల్ ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఆయిల్ రికవరీ పెంపునకు రైతులు నాణ్యమైన గెలలను ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. పచ్చి గెలలు తరలిస్తే ఆయిల్ రికవరీ తగ్గుతుందని, ఆ ప్రభావం ధరపై పడుతుందని స్పష్టం చేశారు.

## ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

చంద్రుగొండ, డిసెంబర్ 2: శాసనసభ ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో జోరుగా బెట్టింగ్స్ కొనసాగుతున్నది. మండలంలోని 14 పంచాయతీల్లో పందెంరాయుళ్లు వేలాది రూపాయాల్లో బెట్టింగ్ కాస్తున్నారు. ఏ అభ్యర్థి గెలుస్తారు? ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది ? పార్టీకి ఎంత శాతం ఓటింగ్ వస్తుంది? అనే అంశాలపై బెట్టింగ్స్ జరుగుతున్నాయి. జూదరులు మధ్యవర్తుల వద్ద సొమ్ము ఉంచి వారితో పర్సంటేజీల మాట్లాడుకోవడం గమనార్హం. తిప్పనపల్లి, రావికంపాడు, రేపల్లెవాడ, తుంగారంలో పందేల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు మండలవాసులు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా ఆదివారం సాయంత్రం వరకు ఫలితాల కోసం అందరూ ఎదురుచూడాల్సిందే.

## వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ఘనంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారిని అభిషేకించారు. అర్చన చేశారు. వేడుకను వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆలయ సిబ్బంది వారికి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలు



విద్యార్థులతో పోటీల నిర్వాహకులు

భద్రాచలం, డిసెంబర్ 2: భద్రాచలం పట్టణంలోని అహోబిల మఠంలో శనివారం భగవద్గీత కంఠస్థ, చిత్రలేఖన పోటీలు జరిగాయి. వాసవీ ప్రజ్ఞా వేదిక ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలను వాసవీ క్లబ్ సారపాక గ్రేటర్, వాసవీ వనిత క్లబ్ నిర్వహించాయి. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్, త్రివేణి స్కూల్, కోమల విద్యామందిర్, రూపా స్కూల్, సరస్వతి శిశు మందిర్, సెయింట్ పాల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రజ్ఞా వేదిక చైర్మన్ కేతేపల్లి ప్రవీణ్ బహూకరించారు. న్యాయ నిర్ణేత రామ్మూర్తి, 'వాసవీ' బాధ్యులు కంచర్ల వీరభద్రం, బ చ్చు సతీష్, పచ్చిపులుసు లలిత కుమారి పాల్గొన్నారు.

# 'పినపాక'లో ఇలా ఓట్లేశారు

సారపాక, డిసెంబర్ 2: పినపాక నియోజకవర్గంలో మొత్తం 1,98,402 మంది (పురుషులు–97,821 మంది, మహిళలు–1,00,577 మంది) ఉన్నారు. వీరిలో మొత్తం 1,58,978 మంది ఓటేశారు. వీరిలో పురుషులు–78,530 మంది, మహిళలు–80,446 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. మొత్తం పోలింగ్ శాతం 80.13 నమోదైంది.

**మండలాలవారీగా...**

పినపాక మండలంలో 26,260 మందికిగాను 22,430 మంది (85.42 శాతం) ఓటేశారు. మణుగూరు మండలంలో 57,498 మందికిగాను 41,829 (72.75 శాతం); బూర్గంపహాడ్ మండలంలో 48,645 మందికిగాను 37,826 మంది (77.76 శాతం); అశ్వాపురం మండలంలో 32,110 మందికిగాను 26,796 మంది (83.45 శాతం); కరకగూడెం మండలంలో 12,552 మందికిగాను 11,067 మంది (88.17 శాతం), ఆళ్లపల్లి మండలంలో 8,681 మందికిగాను 7,776 మంది (89.57 శాతం); గుండాల మండలంలో 12,656 మందికిగాను 11,254 మంది (88.92 శాతం) ఓటేశారు. పాల్వంచలోని అనుబోస్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 244 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 18 రౌండ్లలో ఎన్నికల సిబ్బంది లెక్కిస్తారు.

# నేడే ఓట్ల కౌంటింగ్

**అభ్యర్థుల్లో ఉత్కంఠ .. ఆసక్తిగా చూస్తున్న ఓటర్లు**



అశ్వారావుపేట, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ఘట్టం ముగిసిన తర్వాత అందరూ ఓట్ల లెక్కింపు కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 1,55,961 మంది ఓటర్లు ఉండగా 1,35,501 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 68,895 మంది, పురుషులు 66,602 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానున్నది. అధికారులు కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ఫలితం కోసం పోటీ చేసిన అభ్యర్థులతోపాటు ఓటర్లూ ఆసక్తిగా చూస్తున్నారు. 14 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానున్నది. మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నది.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

టేకులపల్లి/ఇల్లెందు/ ములకలపల్లి, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా టేకులపల్లి సర్కిల్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైగన్‌రెడ్డి రమణారెడ్డి, ఇల్లెందు సీఐ కరుణాకర్, ములకలపల్లి ఎస్సై సాయికిషోర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ 5వ వరకు అమలులో ఉన్నందున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పటాకులు సైతం కాల్చొవద్దని సూచించారు. ఓడిన వారిని ఎగతాళి చేసినా, గేళి చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడా గుంపులు గుంపులుగా గుమిగూడవద్దన్నారు. డీజేలు పెట్టినా, ర్యాలీలు నిర్వహించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## అయ్యప్పస్వామి నగర సంకీర్తన



తల్లాడ: నగర సంకీర్తన నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

తల్లాడ, డిసెంబర్ 2: మండలంలోని కుర్నవల్లిలో అయ్యప్ప మాలధారులు శుక్రవారం రాత్రి నగర సంకీర్తన నిర్వహించారు. వెంకటచలపతిస్వామి ఆలయం నుంచి కుర్నవల్లిలోని రామాలయాలు, అయ్యప్పస్వామి ఆలయాల్లో నగర సంకీర్తన నిర్వహించారు. గురుస్వాములు అన్నెం కోటిరెడ్డి, అయిలూరి శేషురెడ్డి, గూడూరు శ్రీనివాసరెడ్డి, అయిలూరి భిక్షామ్మరెడ్డి, బోడేపూడి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు**



కారేపల్లి: పూజల్లో గురుస్వాములు

కారేపల్లి, డిసెంబర్ 2: స్థానిక సాయిబాబా మందిరంలోని పీఠం వద్ద అయ్యప్ప మాలధారులు శనివారం అభిషేక పూజలు చేశారు. గురుస్వాములు గొడుగు శ్రీనివాస్, జంగా వెంకటేశ్వర్లు, పాలిక సారయ్య, బాలకృష్ణ, పాలిక శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత




ల్యాప్‌టాప్ అందిస్తున్న మురళీకృష్ణ

వైరా రూరల్/వైరా టౌన్, డిసెంబర్ 2: మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి లాలీ కృష్ణప్రసాద్‌కు ల్యాప్‌టాప్‌ను లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ శనివారం అందించారు. క్లబ్ బాధ్యులు వుంద్రు శ్యామ్‌బాబు, తోటకూర శ్రీకాంత్, పారుపల్లి కృష్ణారావు, గంగవరపు కిషన్, వుయ్యూరు రామకృష్ణ, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో సాయికి గోల్డ్ మెడల్



విజ్వల్ సాయితో కోచ్, ఉపాధ్యాయులు

సత్తుపల్లి, డిసెంబర్ 2: పట్టణంలోని కేకేఆర్ సీఎస్ఆర్ ఆదిత్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న టీ విజ్వల్ సాయి గౌరవ్.. అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. అతడిని పాఠశాల కరస్పాండెంట్ వైష్ణవి, డైరెక్టర్లు కె.అవినాష్, సీహెచ్ హరీశ్, వీవీఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ చైతన్య, ఉపాధ్యాయులు, కోచ్ శనివారం అభినందించారు. పునకోసి షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కజకిస్తాన్ దేశంలో ఇటీవల కరాటే పోటీలు జరిగాయి. పది దేశాల నుంచి క్రీడాకారులతో విజ్వల్‌సాయి తలపడి విజేతగా నిలిచి, గోల్డ్ మెడల్ అందుకున్నాడు.

## మద్యం దుకాణాలు ప్రారంభం

సత్తుపల్లి, డిసెంబర్ 2: నూతన మద్యం పాలసీ కింద లాటరీలో షాపులు దక్కించుకున్న యజమానులు వాటిని శుక్రవారం ప్రారంభించారు. సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 23 షాపులు ఉన్నాయి. వాటిలో సత్తుపల్లి మండలంలో ఎనిమిది, వేంసూరు మండలంలో నాలుగు, పెనుబల్లి మండలంలో ఐదు, కల్లూరు మండలంలో ఆరు షాపులు ఉన్నాయి. వీటి లైసెన్స్ గడువు 1 డిసెంబర్ 2023 నుంచి 30 నవంబర్ 2025 వరకు అమలులో ఉంటుంది.